ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న అలిండియా క్రాఫ్ట్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటోంది. మేళాలో భాగంగా శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రముఖ నాట్యాచార్యులు విశ్రాంత ప్రొఫెసర్ భాగవతుల సేతురాం శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.

వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు ఇద్దరి మృతి

వేర్వేరు చోట్ల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. చందానగర్, మియాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోఈ ప్రమాదాలు జరిగాయి.



శేరిలింగంపల్లి: రోడ్డు ప్రమాదంలో లారీ స్కూటీని ఢీ కొట్టగా స్కూటీని నడిపే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఇసుక విక్రయదారు లౌద్యాలాల్ సింగ్‌నాయక్(42) చందానగర్‌లో ఇసుక విక్రయదారుగా కొనసాగుతూ పాపిరెడ్డికాలనీలో నివాసముంటున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం ఇసుక విక్రయించే చోటుకు వచ్చి ఉండి మధ్యాహ్నం ఇంటికి వెళ్ళి భోజనం చేయడానికి వెళ్ళాడు. భోజనం చేసిన తర్వాత తిరిగి ఇసుకవిక్రయించే చోటుకు రావడానికి స్కూటీపై వస్తున్నాడు. చందానగర్‌లో యూటర్న్ తీసుకుంటుండగా మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్‌వైపు వెళ్ళేందుకు వస్తున్న టారీ టస్కర్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో దాని టైర్ల కింద పడి స్కూటీపై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మియాపూర్: గుర్తు తెలియని లారీ కంటైనర్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోచోటుచేసుకుంది. ఎస్‌ఐ మీనా కుమారి తెలిపిన మేరకు..ఎస్‌ఆర్‌నగర్‌లోని బాపునగర్‌కు చెందిన భట్టు సజ్జన్‌కు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు భట్టు శ్రీకాంత్(26),బర్గర్‌కింగ్‌లో పనిచేస్తున్నాడు. నైట్ డ్యూటీ ఉండడంతో గురువారం రాత్రి శ్రీకాంత్ డ్యూటీకి వెళ్లాడు. ఉద్యోగం ముగించుకుని శుక్రవారం ఉదయం ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. చందానగర్ నుండి కూకట్‌పల్లి వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో శుక్రవారం తెల్లవారుజామున బొల్లారం క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై వెనుకనుండి గుర్తుతెలియని లారీ కంటైనర్ వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీకాంత్ కిందపడగా తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

మురుగునీటిని తరలించేందుకు చర్యలు



మురుగునీటిని మళ్లించేందుకు కాలువ తవ్విస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శేరిలింగంపల్లి పరిధిలోని నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ వెళ్లే మార్గంలో తెల్లాపూర్ ముఖద్వారం వద్ద కొన్ని రోజులుగా రోడ్డుపై మురుగునీరు చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం విధితమే. ఈ సమస్యపై సాక్షి దినపత్రికలో 'మురుగుతో జనం బేజార్' అనే శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఏఈ సంజయ్‌కుమార్‌తో కలిసి మురుగునీటిని తరలించేందుకు జేసీబీతో కాలువ తవ్వించి మురుగునీటిని మళ్లించారు. దీంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

లులూ మాల్‌లో ఫైర్ స్టోన్ గ్రిల్ బఫే రెస్టారెంట్

- 187 రకాల ఆహార పదార్థాలతో అతి పెద్ద మెనూ
- ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కూకట్‌పల్లి: హైదరాబాద్‌లోని ఆహార ప్రియుల కోసం లులూమాల్‌లో ఒక సరికొత్త ఫైర్ స్టోన్ గ్రిల్ బఫే రెస్టారెంట్ ప్రారంభమైంది. దిగుమతి చేసుకున్న ఒల్కనిక్ స్టోన్ మీదే వంటలన్నీ చేయడంతో దాని ఫ్లేవర్‌తో కలిసి ఒక సరికొత్త రుచి ఇక్కడి వంటకాలకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఒకేసారి 200 మందికి పైగా ఇక్కడ కూర్చుని ఈ రుచులను ఆస్వాదించవచ్చు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పాల్గొని రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొన్నారు. నిర్వాహకులు సూర్యదేవర అజయ్, సూర్యదేవర శ్రీలక్ష్మీగౌతమ్ మాట్లాడుతూ.. కొండాపూర్‌లో తమ మొదటి రెస్టారెంట్‌ను గతంలో ప్రారంభించామని ఇది రెండవదని పేర్కొన్నారు.

బీజేపీ ప్రభుత్వం ఎంపీలకు రక్షణ లేకుండా చేసింది

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి: పార్లమెంట్‌కు చెందిన 141 మంది సభ్యులను నిరంకుశంగా సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా పార్కు వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ నిరసనలో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. పార్లమెంట్‌లోకి ఆగంతకుల చొరబాటును నిరోధించలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. భద్రతా వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి చేసిన ప్రయత్నమే పార్లమెంటు సభ్యుల మూకుమ్మడి సస్పెన్షన్ అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నియంతృత్వ పోకడలు పనికి రావని అన్నారు. గొప్పలు చెప్పుకునే మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ సభ్యులకే రక్షణ లేకుండా చేసిందని విమర్శించారు. దేశచరిత్రలో ఎప్పుడు లేని విధంగా ఇంత మంది ఎంపీలను సస్పెండ్ చేయటం దారుణమని అన్నారు. దీనికి ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

తగ్గిన రైళ్లు.. పెరిగిన ఇక్కట్లు

ఎంఎంటీఎస్ రైల్ సర్వీసుల కుదింపు

- లింగంపల్లి నుంచి 102 సర్వీసుల నుంచి 66 సర్వీసులకు కుదింపు
- ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు సర్వీసుల నిలిపివేత







శేరిలింగంపల్లి: పేద, మధ్యతరగతి, అన్నిరకాల ఉద్యోగవర్గాలవారికి ఎంతో ఉపయుక్తంగా ఉండే ఎంఎంటీఎస్ రైల్ల సంఖ్య తగ్గిపోయింది. దీంతో అక్టోబర్ మాసం నుంచి ప్రయాణికులు నిత్యం అవస్థల పాలవుతున్నారు. ప్రత్యామ్నాయంగా బస్సులు, ఆటోలపై ఆధారపడుతూ ఎక్కువ చార్జీలు పెట్టి రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఏడాది నుంచి ఎంఎంటీఎస్ రైళ్ళను పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉదయం, సాయంత్రమే రైళ్ళు

- లింగంపల్లి నుంచి హైదరాబాద్‌కు ఎంఎంటీఎస్ సర్వీసులు తెల్లవారు జాము నుంచి ఉదయం 9.15 వరకు నడుస్తున్నాయి. ఆ తర్వాత మళ్లీ సాయంత్రం 4.10కి ఈ రైళ్లు ప్రారంభమవుతున్నాయి. దీంతో ఈ మధ్య సమయంలో ఎలాంటి రైళ్ళను నడపడం లేదు
- అలాగే లింగంపల్లి నుంచి ఫలక్‌నామా వైపు రైళ్ళు తెల్లవారుజాము నుంచి ఉదయం 10.05 గంటల వరకు ఆతర్వాత మళ్ళీ సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమవుతూ రాత్రి వరకు సాగిస్తున్నారు. దీంతో మధ్య సమయంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోతున్నారు.

102 నుంచి 66 సర్వీసులకు కుదింపు

- ఎంఎంటీఎస్ రైళ్ళను లింగంపల్లి నుంచి సికింద్రాబాదు, ఫలక్‌నామా, ఉందానగర్, మేడ్చల్, హైదరాబాద్ వరకు ప్రతి నిత్యం నడిపిస్తున్నారు.
- సెప్టెంబర్ 30 వరకు రోజూ 102 సర్వీసులను అప్ అండ్ డౌన్ రైళ్లను నడిపేవారు. దీంతో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేది.
- కానీ ఈ ఎంఎంటీఎస్ సర్వీసులను అక్టోబర్ 1 నుంచి ట్రాక్ మెయింటెనెన్స్ పేరిట 66 సర్వీసులకు కుదించారు. దీంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతూ ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యంపై దృష్టి

- ఎంఎంటీఎస్ రైళ్ళ సంఖ్య తగ్గిపోవడంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.
- ముఖ్యంగా చిరువ్యాపారులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు కూడా ఈ రైళ్లనే నమ్ముకొని రాకపోకలు సాగిస్తుంటారు.
- ఐటీ ఉద్యోగులు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి లింగంపల్లి, హఫీజ్‌పేట్, హైటెక్ సిటీ తదితర ఎంఎంటీఎస్ ద్వారా రాగా వారిని రైల్వే స్టేషన్ నుంచి ఐటీ సంస్థ వరకు ఆయా సంస్థకు చెందిన వాహనాల్లో తీసుకెళ్ళడం జరుగుతోంది.
- అంతేకాకుండా ఉద్యోగులు, ఇతర చిరు వ్యాపారులు, ఇతరులు కూడా రాకపోకలు సాగిస్తూ ఉంటారు.
- ముఖ్యంగా తక్కువ చార్జీలతో రాకపోకలు సాగిస్తుండడంతో అందరికీ ఎంతో ఈ రైళ్ళు ఎంతో ఉపయుక్తంగా మారాయి. కానీ సర్వీసులు తగ్గించడంతో పది రూపాయలతో రాకపోకలు సాగించే వారు ఇతర వాహనాలను ఆశ్రయించి మూడు, నాల్గింతల చార్జీలు చెల్లించి రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు.

కూరగాయల ధరలు



శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 25, పచ్చిమిర్చి 50, బెండ 60, కాకర 70, దొండ 80, దోస 40, ఆలు 25, చామ 50, కీర 30, బీర 70, వంకాయ 60, గోకర 70, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 40 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 280, వెల్లుల్లి 300.

కొండాపూర్ టు శంషాబాద్ ఎయిర్‌పోర్టు బస్సు వేళలు

రాయదుర్గం: కొండాపూర్ నుంచి శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు కొత్తగా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో నుంచి ఈ బస్సు సౌకర్యం కల్పించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతి గంటకు ఒక బస్సు నడిచేలా ఏర్పాట్లు చేశారు. ఈ బస్సుకు 333 రూట్ నెంబర్‌గా నిర్ధారణ చేశారు. ప్రతి రోజు కొండాపూర్ నుంచి ఈ బస్సు ఉదయం 6.30 గంటలకు మొదటి బస్సు బయలు దేరుతుంది. చివరి బస్సు సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరుతుంది. కొండాపూర్ నుంచి బయలు దేరి హైటెక్‌సిటీ, మాదాపూర్, జూబ్లీచెక్‌పోస్ట్, జర్నలిస్ట్‌కాలనీ, ఏసీబీఆఫీస్, మాసబ్ ట్యాంక్, సరోజిని ఆస్పత్రి, మోహదీపట్నం, అత్తాపూర్, హైదర్‌గూడఎక్స్‌రోడ్, ఉప్పరపల్లిఎక్స్‌రోడ్, వీకర్‌సెక్షన్‌కాలనీ, ఆరాంఘర్, ఏజీకాలేజ్, శంషాబాద్, రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వరకు బస్సును నడిపిస్తారు.

రామానుజన్‌కు ఘన నివాళి



కార్యక్రమంలో పాల్గొన్న అచార్యులు సోమన్ అభయ్ అనంత్

మాదాపూర్: గణితంలో రాణిస్తే ఉన్నత విద్యలోని అనేక రంగాలలో సులభంగా రాణించవచ్చని ఆచార్య సోమన్ అభయ్ అనంత్ అన్నారు. మాదాపూర్‌లోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో శుక్రవారం జాతీయ గణితశాస్త్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం గణితశాస్త్ర అచార్యులు సోమన్ అభయ్ అనంత్ పాల్గొని శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయులు సున్నాను కనుగొనడం వల్లన సంఖ్యలను సూచించడం, వాటితో ఘనన సులువుగా మారిందన్నారు. దానితో సున్నాని ఉపయోగించిన దశాంశ మానాన్ని ప్రపంచమంతా ఉపయోగిస్తున్నారన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.బసవలింగం, గణితశాస్త్ర అధ్యాపకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

చేనేత చీరకట్టు మగువ అందానికే హుందాతనం



లక్డీకాపూల్: చేనేత చీరకట్టు..మగువ అందానికి మరింత అందాన్ని ..హుందాతనాన్ని ఇనుమడింపజేస్తుందని ప్రముఖ యాంకర్ సుమ కనకాల అన్నారు. శుక్రవారం మాదాపూర్ కాకతీయ హిల్స్ లోని కాంచిపురం నైరా సిల్క్స్ లో ఆమె కంచి ఉదయాక్షిని ప్రత్యేక కలెక్షన్ ను ఆవిష్కరించారు. సుమ అక్కడి పట్టును చీరలను వెరైటీలను తిలకిస్తూ, వాటి డిజైన్స్ ను , తయారీ విధానం వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా నేసిన కంచి పట్టు చీరలు, వాటి రంగులు మాటల్లో వర్ణించలేనంత అందంగా, అద్భుతంగా ఉన్నాయన్నారు.

ఎంపీల సస్పెన్షన్ అప్రజాస్వామికం



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

మియాపూర్: పార్లమెంట్ శీతాకాల సమావేశంలో సభ కార్యక్రమాలు సజావుగా సాగకుండా ఇండియా కూటమి సభ్యులను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మియాపూర్ ఆల్విన్ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకులు బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో ప్రజల ప్రక్షాన గొంతు వినిపిస్తున్న 147 మంది పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడం బీజేపీ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బాను ప్రసాద్, జానకీ రామరాజు, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్‌లో చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణ పనులను కౌన్సిలర్ సుజాత శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు మహేందర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

జిన్నారం(పటాన్‌చెరు): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుమ్మడిదల మండలంలోని అన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ గుమ్మడిదల, జిన్నారం మండలాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై చర్చించారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో వచ్చే నెల 9వ తేదీన జరగనున్న జాతరకు ఏర్పాట్లను కార్పొరేటర్ పుష్పనగేష్ శుక్రవారం పరిశీలించారు. ఆమె వెంట సమితి అధికారులు, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ సురేష్ తదితరులు ఉన్నారు.

వేద మంత్రోచ్ఛరణల మధ్య భూమిపూజ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్-2లోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో కొత్తగా కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. శుక్రవారం వేద మంత్రోచ్చరణల మధ్య భూమిపూజ మహోత్సవం జరిగింది. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన భూమిపూజకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మంగళ వాయిద్యాలు, శివ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఈ పూజలో అరుణ్ గురుస్వామి, ప్రధాన అర్చకులు అఖిలేశ్వర శర్మ, డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, జోగిపేట భాస్కర్ పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

జిన్నారం(పటాన్‌చెరు): ఈనెల 18న ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి నీటికుంటలో పడి శవమై శుక్రవారం కనిపించాడు. బొల్లారం సీఐ నయీముద్దీన్ కథనం ప్రకారం.. దుండిగల్ తండాకు చెందిన అంగుటు పాండు(30) ఈనెల 18న కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో అప్పట్లో దుండిగల్ పీఎస్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జిన్నారం మండలంలోని ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని పరిశ్రమ పక్కన ఉన్న నీటికుంటలో మృతదేహం కనిపించింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పాండుగా గుర్తించారు. మృతుడికి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇంట్లో వాళ్లతో గొడవపడి ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

చెరువులను సుందరీకరిస్తాం



ఎల్లమ్మచెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, నాయకులు, కాలనీవాసులు

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని చెరువులను దశలవారీగా సమగ్ర అభివృద్ధి చేసి సుందరీకరిస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలోని ఎల్లమ్మచెరువు వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, చెరువుల సుందరీకరణ స్థానికులు ఆహ్లాదపూరిత వాతావరణంలో గడిపేలా చేసేదని, దీన్ని దృష్టిలో పెట్టుకొని పనులు చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఖాజాగూడలోని ఎల్లమ్మ చెరువు సుందరీక రణ, సంరక్షణ, అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, చంద్రకాంత్‌రావు, సాయివైభవ్‌కాలనీ వాసులు పద్మ, అశోక్‌రాజు, సత్యనారాయణ, రాజశేఖర్, శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు

మీ అందరికీ రుణపడి ఉంటా

- అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తాం
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- రాబోయే ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపు



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి ఫొటో ఫ్రేమ్‌ను అందజేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

పటాన్‌చెరు: మూడోసారి గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరికీ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో లేకున్నా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులను చేపడతామన్నారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థలు, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో గాలి అనిల్ కుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, సీనియర్ నాయకులు శంకర్‌యాదవ్, సపాన దేవ్, ఎంపీపీలు సుష్మాశ్రీ , దేవానందం, జెడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్లు లలితాసోమిరెడ్డి, పాండురంగారెడ్డి, రోజాబాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందన

ఇటీవల నిర్వహించిన 67వ తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో అండర్ 14 బ్యాడ్మింటన్ విభాగంలో బంగారు పతకం సాధించిన పటాన్‌చెరు పట్టణానికి చెందిన హర్ష, నర్రా శబరీష్‌ను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే హాజరు

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని బచ్చుగూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బీరప్ప, మహంకాళి దేవాలయం విగ్రహాల ప్రతిష్ఠాపన ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమతిరామచందర్, పోచారం సర్పంచ్ జగన్, తదితరులు పాల్గొన్నారు.

దారి కాచి దోపిడీ

10 మంది నిందితుల అరెస్ట్



మాదాపూర్‌లోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్

మాదాపూర్: ద్విచక్రవాహనాలపై వెళుతున్న వారిని ఆపి వారినుంచి బంగారు ఆభరణాలను లాక్కున్న నిందితులను పోలీసులు అరెస్టుచేశారు.ఈ సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 17వ తేదీన అర్ధరాత్రి మాదాపూర్ అయ్యప్పసొసైటీ 100 అడుగుల రోడ్డులో ద్విచక్ర వాహనంపై పవన్‌కుమార్ అనే వ్యక్తి తన ఇద్దరు స్నేహితులతో కలసి అమీర్‌పేట్ వైపు వెళుతున్నారు.బోరబండకు చెందిన మహమ్మద్ మగ్దుమ్(26), ఎండీ అబ్దుల్ దావుద్(24), మనేపల్లి గౌతమ్ శ్రీనివాస్(20), సయ్యద్ అబ్బాస్(20), షేక్ ఇమ్రానుల్లా(22), ఎండీ ఖలీమ్ ఉల్లా(29), షేక్ యూనస్(23), ఎండీ అబ్దుల్ ఖాసీఫ్(22), సయ్యద్ ఫైజాన్(19), కోట అబినయ్(19) అనే 11 మంది యువకులు 5 బైక్‌లపై వచ్చి వారిని అడ్డుకుని వారి వద్ద 2తులాల బంగారం చైన్, 4 తులాల వెండి చైన్‌లను అపహరించారు. దీంతో బాధితులు పోలీసులకుఫిర్యాదు చేశారు. ఈనెల 21వ తేదీన 5గంటల సమయంలో సున్నం చెరువు వద్ద నిందితులు ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా తామే చేసినట్టు ఒప్పుకున్నారు. 10 మంది పట్టుబడ్డారు. నిందితుల వద్ద దొంగతనానికి ఉపయోగించిన 5 ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్‌లు, 1.5 తులాల బంగారు చైన్, 39.90 గ్రాముల వెండి చైన్‌లు స్వాధీనం చేసుకున్నారు. క్రైం సీఐ వెంకట్, క్రైం పోలీసు సిబ్బంది బి.కేశవులు, కె.రాఘవేందర్, యు.ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.